సంక్షిప్త వార్తలు

20 శాతం తగ్గిన వర్షపాతం

న్యూఢిల్లీ: ఈ ఏడాది వర్షాకాలంలో ఇప్పటి వరకు సాధారణం కన్నా 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు సాధారణం కన్నా 20 శాతం తక్కువ వర్షం కురిసింది. మధ్య భారతంలో ఈ తగ్గుదల 29 శాతం వరకు ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో రుతుపవనాలు ముందుగా రావడంతో, సాధారణం కన్నా 17 శాతం అధిక వర్షపాతం నమోదైంది.

నిఖిల్ గుప్తా అమెరికాకు అప్పగింత

వాషింగ్టన్: భారత జాతీయుడు నిఖిల్ గుప్తాను చెక్ రిపబ్లిక్ నుంచి అమెరికాకు తీసుకెళ్లారు. ఆయన ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర పన్నినట్లు అమెరికా ఆరోపిస్తున్నది. అమెరికా విజ్ఞప్తి మేరకు ఆయనను గత ఏడాది చెక్ రిపబ్లిక్‌లో అరెస్ట్ చేశారు. భారత ప్రభుత్వ అధికారి ఆదేశాల మేరకు పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ కుట్ర పన్నారన్న అమెరికా ఆరోపణలను భారత ప్రభుత్వం తిరస్కరించింది.

వరల్డ్ బెస్ట్ స్కూల్ ప్రైజ్ రేసులో 5 భారత స్కూళ్లు

లండన్: వరల్డ్ బెస్ట్ స్కూల్ 2024 ఏడాది పురస్కారాలకు సంబంధించి షార్ట్ లిస్ట్‌లో 5 భారతీయ స్కూల్స్ చోటు దక్కించుకున్నాయి. సమాజ పురోగతికి తనవంతు సహకారం అందించిన స్కూల్స్‌కు వివిధ క్యాటగిరీల్లో ఏటా ఈ బహుమతులు ప్రకటిస్తారు. లండన్‌కు చెందిన 'టీ4 ఎడ్యుకేషన్' అనే సంస్థ ఒక్కో బెస్ట్ స్కూల్‌కు 10 వేల డాలర్ల ప్రైజ్‌మనీని అందజేస్తున్నది. ఈసారి టాప్-10కు సంబంధించి షార్ట్ లిస్ట్‌లో మధ్యప్రదేశ్ నుంచి రెండు, ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి ఒక్కో స్కూల్ ఎంపికయ్యాయి.

అట్లయితే బీజేపీకి 40 సీట్లే వచ్చేవి: ఆదిత్య ఠాక్రే

ముంబై: లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగి ఉంటే బీజేపీ కేవలం 40 స్థానాల్లో మాత్రమే గెలిచేదని శివసేన (యూబీటీ) నేత, ఎమ్మెల్యే ఆదిత్యఠాక్రే చెప్పారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ సీఎం షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన రవీంద్ర వైకర్ కేవలం 48 ఓట్ల తేడాతో శివసేన (యూబీటీ) అభ్యర్థి అమోల్ కీర్తికర్‌పై గెలవడం మోసమని ముంబై నార్త్‌వెస్ట్ ఫలితంపై కోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

ముస్లింలు, యాదవులకు పనులు చేయను : జేడీయూ ఎంపీ

పాట్నా: జేడీయూ ఎంపీ దేవేశ్ చంద్ర ఠాకూర్ సోమవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ముస్లింలు, యాదవులు ఓట్లు వేయలేదని, అందువల్ల వారి కోసం పని చేయబోనని చెప్పారు. ఆయన సీతామడి నియోజకవర్గం నుంచి గెలిచారు. 'ముస్లింలు, యాదవులు రావాలనుకుంటే రావచ్చు, టీ తాగి, స్నాక్స్ తిని, వెళ్లిపోవచ్చు. కానీ ఎటువంటి సహాయాన్ని ఆశించొద్దు' అని పేర్కొన్నారు.

మాంసపు బియ్యం

తయారుచేసిన దక్షిణకొరియా శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, జూన్ 17: మాంసపు బియ్యం ఏంటి అనుకొంటున్నారా? ప్రయోగశాలలో అభివృద్ధి చేసిన గోవు మాంస కణాల్ని బియ్యం గింజల్లోకి ఇంజెక్ట్ చేసి.. సరికొత్త బలవర్ధకమైన ఆహారాన్ని దక్షిణ కొరియా సైంటిస్టులు సృష్టించారు. సాధారణ బియ్యంలో ఉండే దానికన్నా 8 శాతం ఎక్కువ ప్రొటీన్, 7 శాతం ఎక్కువ కొవ్వు కలిగివుండే 'మీటీ రైస్' (హైబ్రిడ్ రకం)ను తయారుచేశారు. 'మీటీ రైస్' పర్యావరణ హితమైందని సైంటిస్టుల బృందానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ హాంగ్ జిన్-కీ చెప్పారు. ఇతర సాధారణ బియ్యం మాదిరే 'మీటీ రైస్' ఉంటాయని, కాకపోతే గులాబీ రంగులో కనిపిస్తూ, మంచి వాసన కలిగివుంటాయని ఆయన అన్నారు. 'జంతువుల్ని వధించకుండా, వాటి కణ జాలాన్ని ల్యాబ్‌లో అభివృద్ధి చేశాం. జంతు ప్రొటీన్‌ను పొందేందుకు మార్గాన్ని కనుగొన్నాం' అని హాంగ్ జిన్-కీ అన్నారు. అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములకు, కరువు కాటకాల్లో సంభవించే పౌష్టికాహార సమస్యను ఇది పరిష్కరిస్తుందని చెప్పారు

భారత్-శ్రీలంక మధ్య వారధి!

కొలంబో: భారత్-శ్రీలంక మధ్య ప్రతిపాదిత వారధి నిర్మాణంపై శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె కీలక ప్రకటన చేశారు. రెండు దేశాల మధ్య భూఅనుసంధానం సాధ్యాసాధ్యాలపై అధ్యయనం తుది దశకు వచ్చిందని తెలిపారు. గత ఏడాది జూలైలో భారత పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య బ్రిడ్జి నిర్మాణంపై ప్రధాని మోదీతో జరిగిన సమావేశంలో రణిల్ విక్రమసింఘె చర్చలు జరిపారు. ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణంపై వచ్చే వారం భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ శ్రీలంక పర్యటన సందర్భంగా కూడా చర్చకు వచ్చే అవకాశం ఉన్నదని వార్తా సంస్థ పీటీఐ పేర్కొన్నది. కాగా, భూ అనుసంధాన ప్రతిపాదన శ్రీలంక నుంచే వచ్చిందని గతంలో భారత ప్రభుత్వం పేర్కొన్నది. భారత్ నుంచి శ్రీలంకలోని ట్రింకోమలీ, కొలంబో పోర్టులను మధ్య వారధి ప్రతిపాదనలో ఉన్నదని వార్తలు వచ్చాయి.

ఐదుగురు నక్సల్స్ మృతి

- జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్‌లో భారీ ఎన్‌కౌంటర్
- మృతుల్లో ఇద్దరు మహిళలు.. పట్టుబడ్డ మరో ఇద్దరు

కొత్తగూడెం క్రైం: జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా అడవుల్లో సోమవారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. మృతులో ఇద్దరు మహిళలు ఉన్నారని, ఇద్దరు మావోయిస్టులు సజీవంగా పట్టుబడ్డారని ఐజీ (ఆపరేషన్స్) అమోల్ విహోంకార్ మీడియాకు వెల్లడించారు. గువా పోలీసు స్టేషన్ పరిధిలోని లిపుంగ ఏరియా సమీపంలో ఉదయం 5 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. దాడుల ప్రణాళికలు రచించేందుకు లిపుంగ అడవుల్లో మావోయిస్టులు సమావేశం అవుతున్నారనే విశ్వసనీయ సమాచారం భద్రతా బలగాలకు అందించింది. దీంతో పోలీసులు, కోబ్రా 209 బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ సంయుక్త సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో లిపుంగ అడవుల్లో తారసపడిన మావోయిస్టులపై కాల్పులు జరిపారు. సుమారు గంటన్నరపాటు జరిగిన ఈ భీకర పోరులో ఐదుగురు మావోయిస్టులు మరణించారు. ఘటనా స్థలిలో పలురకాల ఆయుధాలు స్వాధీనం చేసుకొన్నారు. మృతులను జోనల్ కమాండర్ కండే హోన్వాగా, సబ్ జోనల్ కమాండర్ సింగ్రాయ్ అలియాస్ మనోజ్, ఏరియా కమాండర్ సూర్య అలియాస్ ముండా దేవగమ్‌తో పాటు మహిళా మావోయిస్టులు జుంగ పుర్టి అలియాస్ మార్ల, సప్ని హన్స్‌దాగా గుర్తించారు. వీరిలో సింగ్రాయ్‌పై రూ.10 లక్షలు, కండేపై రూ.5 లక్షలు, సూర్యపై రూ.2 లక్షల చొప్పున రివార్డులు ఉన్నాయి. పట్టుబడిన మావోయిస్టులను ఏరియా కమాండర్ టైగర్ అలియాస్ పండు హన్స్‌దా, బత్రీ దేవగమ్‌గా హోంకార్ ధ్రువీకరించారు.

డిలీట్ చేసిన మెసేజ్‌లు చూసిన భార్య విడాకులు..

యాపిల్‌పై 53 కోట్లకు భర్త దావా

లండన్: తాను డిలీట్ చేసిన మెసేజ్‌లు చూసిన భార్య విడాకులకు దరఖాస్తు చేయడంతో తట్టుకోలేకపోయిన ఓ వ్యాపారవేత్త టెక్ దిగ్గజం యాపిల్‌పై రూ.53 కోట్లకు దావా వేశాడు. ఇంగ్లండ్‌కు చెందిన ఆయన తన ఐఫోన్‌లోని ఐ మెసేజ్ యాప్ నుంచి సెక్స్ వర్కర్లతో చాట్ చేసేవాడు. అవి భార్య కంట పడకుండా డిలీట్ చేస్తూ జాగ్రత్త పడేవాడు. అయితే, తన ఫోన్ ఐడీనే కుటుంబం ఉపయోగించే ఐమ్యాక్‌కు లింక్ చేసిన విషయాన్ని మర్చిపోయాడు. చాటింగ్ మెసేజ్‌లను ఫోన్‌లో డిలీట్ చేసినప్పటికీ ఐమ్యాక్‌లో అలానే ఉండిపోయాయి. ఒకరోజు వాటిని చూసిన ఆయన భార్య.. విడాకులకు దరఖాస్తు చేసింది. దీంతో సదరు వ్యాపారవేత్త యాపిల్‌పై కోర్టుకెక్కాడు. విడాకులు మంజూరైతే ఆమెకు దాదాపు రూ. 53 కోట్లు చెల్లించాల్సి వస్తుందని, కాబట్టి వాటిని ఇప్పించాలని కోర్టును ఆశ్రయించాడు. ఫోన్‌లో మెసేజ్‌లు డిలీట్ చేస్తే మొత్తంగా డిలీట్ అయ్యాయనే అనుకుంటామని, ఈ విషయంలో యాపిల్ కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నది అతడి వాదన. మెసేజ్‌లు డిలీట్ చేసినప్పుడు ఆ డివైజ్‌లో మాత్రమే డిలీట్ అయినట్టు మెసేజ్ వస్తే యూజర్లు అప్రమత్తమవుతారని, ఈ విషయంలో యాపిల్ విఫలమైందని, కాబట్టి తనకు జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించాలని ఆ పిటిషన్‌లో కోరాడు.

జర్మనీలో 23 వేల కోట్ల కొకైన్ స్వాధీనం

బెర్లిన్: జర్మనీలో రూ.23 వేల కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. ఏడుగురిని అరెస్ట్ చేశామని అధికారులు తెలిపారు. డ్యుసెల్‌డోర్ఫ్ నగరంలోని ప్రాసిక్యూటర్లు మాట్లాడుతూ, కొలంబియా అధికారుల సమాచారం మేరకు 35.5 మెట్రిక్ టన్నుల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హాంబర్గ్ పోర్టులో 25 టన్నులు, రాడర్‌డామ్ పోర్టులో 8 టన్నులు, కొలంబియాలో 3 టన్నుల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. జర్మనీ, బల్గేరియా తదితర దేశాలకు చెందిన నిందితులు లాటిన్ అమెరికా నుంచి యూరప్ దేశాలకు గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్యలో కొకైన్‌ను పెద్ద ఎత్తున తరలించారని చెప్పారు.

హత్యకు ముందు కరెంట్ షాక్‌తో చిత్రహింసలు

దర్శన్ అభిమాని హత్య కేసులో విస్తుగొలిపే విషయాలు

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్శన్, పవిత్ర గౌడ, ఇతరులు కలిసి రేణుకాస్వామిపై అత్యంత కర్కశకంగా దాడికి తెగబడినట్టు పోస్ట్‌మార్టం నివేదిక చెబుతున్నది. హత్యకు ముందు రేణుకాస్వామికి కరెంట్ షాక్ ఇచ్చి..చిత్ర హింసలకు గురిచేసినట్టు తెలిసింది. ఇటీవల అరెస్టు చేసిన కేబుల్ వర్కర్ ధన్‌రాజ్‌ను విచారించగా ఈ విషయాలు బయటకు వచ్చాయని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. బాధితుడి శరీరంపై 39 గాయాలుండగా, ఏడు చోట్ల కాలిన గాయాలున్నాయని పోలీసులు గుర్తించారు.

డ్యామ్‌ను పరిశీలిస్తున్న కేఆర్‌ఎంబీ చైర్మన్ అశోక్‌గోయల్

సాగర్‌ను సందర్శించిన కేఆర్‌ఎంబీ చైర్మన్

వరదలనేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచన

నందికొండ, జూన్ 17 : కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ అశోక్‌గోయల్ సోమవారం నాగార్జున సాగర్ డ్యామ్‌ను సందర్శించారు. డ్యామ్, గ్యాలరీ, క్రస్ట్ గేట్లు, స్పిల్‌వే, ప్రధాన జల విద్యుత్తు కేంద్రాలను పరిశీలించి, నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా పరీవాహక ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో నాగార్జున సాగర్ డ్యామ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టులోకి నీరు వచ్చే వరకు ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు. ఆయన వెంట కేఆర్‌ఎంబీ సభ్యుడు సంకువ, ఎస్ఈ వరలక్ష్మీదేవి, డీఈ అజయ్, ఏఈ రాజేశ్‌చారి, ఎన్ఎస్‌పీ ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ మల్లికార్జున, డీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

40 కోట్ల మంది 'మహాలక్ష్మి' ప్రయాణం

ప్రమాదాల నివారణకు బస్సు డోర్ల వద్ద స్టిక్కర్లు

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు సుమారు 40 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించినట్టు టీజీఎస్ ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. సుమారు 1,800 కోట్ల రూపాయలను మహిళలు ఆదా చేసుకున్నట్టు తెలిపారు. ప్రయాణాల్లో మహిళల సంఖ్య పెరగడం, మహిళలు ఏ డోర్ నుంచి బస్సు ఎక్కుతున్నారో తెలియకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు బస్సుల డోర్ల వద్ద కొత్తగా స్టిక్కర్లను అతికిస్తున్నారు. స్త్రీలు ముందు వైపు, పురుషులు వెనుక వైపు నుంచి బస్సు ఎక్కాలని సూచిస్తూ స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ముందు ద్వారం వద్ద మహిళల ఫొటో, వెనక ద్వారాల వద్ద పురుషుల ఫొటోతో పెయింట్ వేశారు. ఎవరికి కేటాయించిన ద్వారం నుంచి వాళ్లే ఎక్కాలని కండక్టర్లు సైతం ప్రయాణికులకు చెప్తున్నారు.

4 నెలల్లో 1,770 కోట్లు లూటీ

5 నెలల్లోనే 8 లక్షల సైబర్ కేసులు!

- దేశమంతా విజృంభిస్తున్న సైబర్ నేరాలు
- రోజుకు సుమారు రూ.14 కోట్ల దోపిడీ
- తెలంగాణలో 4 నెలల్లో 30వేల కేసులు
- అనుక్షణం అప్రమత్తం: సైబర్ నిపుణులు

దేశంలో గత ఐదేండ్లలో నమోదైన కేసులు

ఏడాది	కేసులు
2020	2,55,777
2021	4,52,414,
2022	9,56,790,
2023	15,56,215
2024	7,40,957

(ఏప్రిల్ నాటికి)

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): దేశంలో సైబర్ నేరాలు దారుణంగా పెరిగిపోతున్నాయి. గడిచిన ఐదు నెలల్లోనే సుమారు ఎనిమిది లక్షలకు పైగా సైబర్ కేసులు నమోదయ్యాయి. గత మూడేండ్లుగా దేశంలో పౌరులు సైబర్ నేరాల బారిన పడటం పెరుగుతున్నది. సైబర్ నేరాల్లో యూపీఐ, క్రెడిట్‌కార్డు, పార్ట్‌టైమ్ జాబ్ మోసాలు అత్యధికంగా ఉన్నట్టు లోకల్ సర్కిల్స్ సర్వే నివేదికలు వెల్లడించాయి. ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 43 శాతం మంది తాము, తమ కుటుంబసభ్యులు క్రెడిట్ కార్డ్ లావాదేవీల్లో మోసపోయామని, 36 శాతం మంది యూపీఐ లావాదేవీల్లో నష్టపోయామని తెలిపారు. పట్టణ ప్రజల్లో ఎక్కువశాతం పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట పంపిన లింక్‌లు, క్యూఆర్‌కోడ్‌లకు డబ్బులు చెల్లించి మోసపోయినట్టు సర్వే తెలిపింది. దేశవ్యాప్తంగా 302 జిల్లాల నుంచి కొన్ని వేల మందిని సర్వే చేయగా ఈ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అన్ని పనులకూ ఆన్‌లైన్ వేదిక కావడం, అక్కడ పౌరుల డాటాను రక్షించే సరైన వ్యవస్థ లేకపోవడంతో పాన్‌కార్డ్, ఆధార్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్, చిరునామా వంటి వ్యక్తిగత సమాచారం విరివిగా లభిస్తున్నది. ఆ డాటా ఆధారంగా ఆర్థిక మోసగాళ్లు సులభంగా ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ మోసాలు రికార్డు స్థాయిలో 300 శాతం పెరిగినట్టు సర్వే తెలిపింది. మొత్తంగా గత రెండేండ్లలో సైబర్ మోసాలు 700 శాతం పెరిగాయని వెల్లడించింది.

రోజుకు రూ.14 కోట్ల మోసాలు!

దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాల ద్వారా నేరగాళ్లు రోజుకు సుమారు 14 కోట్ల రూపాయలను అమాయకుల నుంచి కొల్లగొడుతున్నారు. అంటే ఏడాదికి సుమారు రూ.5వేల కోట్లను వివిధ పద్ధతుల్లో దోచుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం గత జనవరి నుంచి ఏప్రిల్ చివరి వరకు నాలుగు నెలల్లో రూ.1,770 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. గడిచిన ఐదేండ్లలో, ఈ ఏడాది ఏప్రిల్ చివరి నాటికి సుమారు 40 లక్షల సైబర్ నేరాలు నమోదయ్యాయి.

తెలంగాణలో ఏటా రూ.1450 కోట్లు

సైబర్ నేరాల వల్ల ఒక్క తెలంగాణలోనే రోజుకు సుమారు రూ.4కోట్ల చొప్పున.. ఏడాదికి సుమారు రూ.1,450 కోట్ల డబ్బును సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు. ఈ ఏడాది మూడు నెలల్లో నమోదైన టాప్-5 సైబర్ నేరాల్లో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ టాప్‌లో ఉంది. బెట్టింగ్‌లకు వ్యసనపరులైన వారిని గుర్తించి.. వారికి ఈజీ మనీని పరిచయం చేసి, అక్కడ బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపు మళ్లిస్తున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు. రూ.1000 నుంచి ఇన్వెస్ట్‌మెంట్ పెట్టించి.. రూ.లక్షలు, కోట్లలో మోసం చేస్తున్నారని చెప్తున్నారు. తర్వాతి స్థానాల్లో ఓటీపీ ఫ్రాడ్స్, అడ్వర్టైజుమెంట్ ఫ్రాడ్స్ (ఓఎల్ఎక్స్), ఫెడ్‌ఎక్స్ కొరియర్ సర్వీసెస్, సెక్స్‌టార్షన్ వంటివి టాప్-5 నేరాల్లో ఉన్నట్టు సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. కాగా గతంలో విపరీతంగా పెరిగిన సెక్స్‌టార్షన్ మోసాలు.. ప్రస్తుతం తెలంగాణలో తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురయ్యామని తెలిసిన వెంటనే (గోల్డెన్ అవర్) 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కోరుతున్నారు. ప్రతిరోజూ కొత్త తరహాలో చేస్తున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియురాలు మృతి.. ప్రియుడికి తప్పిన ముప్పు
- మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డలో ఘటన

రవళి (ఫైల్)

రవీందర్ (ఫైల్)

బయ్యారం, జూన్ 17: ఓ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. ప్రియురాలు మృతిచెంది.. ప్రియుడికి ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డలో చోటు చేసుకుంది. కోటగడ్డకు చెందిన కొట్టెం లక్ష్మీనారాయణ -లీలావతి దంపతుల కూతురు రవళి (23)కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సాయన్నపేటకు చెందిన ఓ వ్యక్తితో మూడేండ్ల కిందట వివాహమైంది. కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా సాగినప్పటికీ ఇరువురి మధ్య కలహాలు రావటంతో రవళి రెండేండ్లుగా భువనగిరి వద్ద కోళ్ల ఫామ్‌లో పనిచేస్తున్న తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నది. సొంతూరుకు వచ్చి వెళ్తున్న క్రమంలో ఇదే గ్రామానికి చెందిన మోండు వీరభద్రం కొడుకు రవీందర్‌తో రవళికి పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. గత ఏప్రిల్‌లో భువనగిరిలో ఉంటున్న రవళిని తీసుకొని రవీందర్ ఆంధ్రా ప్రాంతానికి వెళ్లి అక్కడే పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరువురి కుటుంబ సభ్యులు తమ పిల్లలు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారం క్రితం శ్రీకాకుళంలో ఉంటున్న వారిని తీసుకొచ్చి.. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మూడు రోజులుగా రవళి రవీందర్ ఇంటి వద్దనే ఉంటున్నది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ప్రేమికులిద్దరూ ఇంట్లోని ఇనుప రాడ్‌కు చున్నీలతో ఉరేసుకోగా రవళి మృతి చెందింది. రవీందర్‌కు ప్రాణాపాయం తప్పింది. అయితే.. రవళి మృతదేహాన్ని చూసిన రవీందర్ భయాందోళనతో కత్తితో చేతి మణికట్టు, గొంతు కోసుకొని మరోమారు ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సీఐ రవికుమార్, ఎస్సై ఉపేందర్ రవీందర్‌ను 108 వాహనంలో మహబుబాబాద్ ఏరియా దవాఖానకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం రవీందర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. కేసు దర్యాప్తులో ఉందని ఎస్సై చెప్పారు.

యూరప్ పంపిస్తానని 10 లక్షల టోకరా

నిజామాబాద్ గ్రామంలో గల్ఫ్ ఏజెంట్ మోసం

కోనరావుపేట, జూన్ 17: యూరప్‌లో ఉపాధి ఆశ చూపి పలువురి నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి దుబాయ్‌కి పరారయ్యాడో ఏజెంట్. బాధితుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా నిజామాబాద్ గ్రామానికి చెందిన చెలిమెల (కమ్మరి) తిరుపతి కొన్నేండ్లుగా గల్ఫ్ దేశం వెళ్లి వస్తున్నాడు. నిరుడు ధర్మారం గ్రామానికి చెందిన తాళ్లపల్లి రాజు, ఊరడి రాములు, వెంగళి నవీన్, వెంగళి దేవయ్య, కొలనూర్‌కు చెందిన బత్తిని రమేశ్, నిజామాబాద్ గ్రామానికి చెందిన పిట్టల రవి, ఊరడి మధుతోపాటు మరికొందరిని యూరప్‌లోని కంపెనీల్లో ఆఫీస్ బాయ్‌గా పని కల్పిస్తానని నమ్మించాడు. తన బంధువు నారపల్లి సుధాకర్ ద్వారా వీరిని కలిసిన తిరుపతి వీసాలు పంపిస్తా.. డబ్బులు సిద్ధం చేసుకోవాలని సూచించాడు. నమ్మిన బాధితులు భూములు అమ్మి, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి, అప్పులు చేసి రూ.10 లక్షల నగదును సుధాకర్ ద్వారా తిరుపతికి అప్పజెప్పారు. ఆ తర్వాత హైదరాబాద్, బెంగళూర్‌లో గ్లోబల్ ఎంబసీలో ఇంటర్వ్యూలు అంటూ మరో రూ.20 వేల చొప్పున వసూలు చేశాడు. మోసపోయామని గుర్తించిన బాధితులు ఏజెంట్‌ను నిలదీశారు. మూడు నెలల్లో వీసాలు పంపకపోతే డబ్బులు తిరిగి చెల్లిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చాడు. ఈ నెల 15తో గడువు ముగియడంతో బాధితులు సోమవారం ఏజెంట్ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. తన భర్త దుబాయ్ వెళ్లాడని, డబ్బుల గురించి తనకేం తెలియదని ఆమె చెప్పడంతో బాధితులు షాక్ అయ్యారు. ఏజెంట్ ఇంట్లో కూర్చొని నిరసన తెలిపారు.

కోనరావుపేటలో గల్ఫ్ ఏజెంట్ ఇంట్లో కూర్చుని నిరసన తెలుపుతున్న బాధితులు

సంధ్య 35 ఎంఎం ఎ/సి- ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

PVR ఆర్.కె - బంజారాహిల్స్ 11.50,4.30,11.00PM
PVR పెంట్రల్‌మాల్- పంజాగుట్ట 11.00,1.20,7.25,10.40
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్- మాదాపూర్ 11.10,1.45,7.50,11.05
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 10.10,1.25,4.40,7.25,10.25
PVR గలేరియా- పంజాగుట్ట 11.00,2.15,7.45,10.45
PVR పివిఆర్- ఎర్రమంజిల్ 11.00,4.35,7.50,11.05
PVR పివిఆర్ - మూసారంబాగ్ 10.45,1.45,7.50,11.05
PVR ప్రెస్టిజ్ ప్లైమ్ - గచ్చిబౌలి 11.20,4.15,7.30,10.45
అర్జున్ 70 - కూకట్‌పల్లి
రాజధాని - బిల్‌సుఖ్‌నగర్
సంపూర్ణ - వనస్థలిపురం
SVC శివశక్తి - కాప్రా
SVC శ్రీలక్ష్మి - కర్మన్‌ఘాట్
SVC సంగీత - ఆర్.సి.పురం
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 10.35,4.15,7.30,10.45
PVR ATRIUM మాల్-గచ్చిబౌలి 11.10,4.10,7.25,10.40
PVR ఎస్2 ఎ/సి - మల్లాపూర్ 11.10,4.15,7.05,10.20
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 10.40,4.10,7.25,10.40
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 10.10,1.25,7.35,10.50
INOX ఎం.పి.మాల్- కాచిగూడ 10.4012.50,7.25,10.30
INOX సత్యనెక్లెస్ మాల్ - కవాడిగూడ 10.35,1.10,7.45,10.40
INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ 10.05,1.20,7.25,10.40
SVC ఈశ్వర్ - అత్తాపూర్
జగదాంబ - ఫుట్‌కేసర్
ప్రశాంత్ - సికింద్రాబాద్
రామకృష్ణ ఎ/సి - అబిడ్స్
శ్రీకృష్ణ ఎ/సి - ఉప్పల్
నర్తకి 70 ఎ/సి - అల్వాల్
AMB ఎఎంఆర్- మౌలాలి 10.30,1.45,4.45,8.00,11.00
MOVIETIME ప్లాటినమ్-అమీర్‌పేట్ 10.00,4.00,7.15,10.00
MOVIETIME ప్లాటినమ్- గచ్చిబౌలి 10.00,3.00,8.00,10.55
Cinépoli లులు మాల్- కూకట్‌పల్లి 10.00,1.20,7.50PM
Cinépoli CCPL- మల్కాజ్‌గిరి 10.30,1.30,10.45PM
Cinépoli డి.ఎస్.ఎల్-ఉప్పల్ 10.50,1.45,10.45PM
Cinépoli మంత్రామాల్ - అత్తాపూర్ 11.00,2.00,7.20,10.20
Cinépoli సుధ ఎ/సి - శాలిబండ 11.00,1.35,10.45PM
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 2.10,10.35PM
వైజయంతి - నాచారం
వెంకటరమణపద్మావతి
కాంప్లెక్స్ ఎ/సి - కాచిగూడ
తాళ్కొలి ఎ/సి - ఇ.సి.ఐ.ఎల్
విజేత ఎ/సి - బోరబండ
శ్రీరాములు - మూసాపేట్
మీరజ్ సినిమాస్ - చందానగర్ 11.10,4.40,7.50,11.00
రాఘవేంద్ర- మల్కాజ్‌గిరి 2.00,11.00PM
ఏపీ స్క్రీన్ -ఉప్పల్ 10.45,1.50,4.50,7.50,10.50
టివోలి - సికింద్రాబాద్